సాక్షి రంగారెడ్డి

సోమవారం | 24 | జులై | 2023



ప్రజా భాగస్వామ్యం ప్రధానం

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజల భాగస్వామ్యమే ప్రధానమని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. 8లో ▸



ఉత్సాహంగా తీజ్

తలకొండపల్లి మండల పరిధిలోని పాతకోట తండాలో గిరిజనులు తీజ్ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. 8లో ▸



అన్ని నియోజకవర్గాల్లో పోటీ

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. 8లో ▸



కడ్తాల్: బోనంతో యువతి



కడ్తాల్: బోనాల ఉత్సవంలో యువకుల నృత్యాలు

బోనాల సందడి

పోతురాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలు.. దప్పుల దరువు.. డీజేల హోరు.. యువతీయువకుల నృత్యాలతో ఆదివారం జిల్లాలోని పలు గ్రామాల్లో బోనాల ఉత్సవాలు అంబరాన్నంటాయి. మహిళలు బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో నైవేద్యాలు సమర్పించారు. సల్లంగా చూడు తల్లి అని మొక్కులు చెల్లించుకున్నారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది.



హుడాకాంప్లెక్స్: బోనాల ఉత్సవంలో మంత్రి సబితారెడ్డి తదితరులు



మీర్‌పేట: బోనాల ఉత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

న్యూస్‌రీల్

ప్రారంభమైన పత్రీజీ సంస్మరణోత్సవాలు



మహేశ్వర మహా పిరమిడ్‌కు చేరుకుంటున్న ధ్యానులు

కడ్తాల్: మహేశ్వర మహాపిరమిడ్‌లో ధ్యాన గురువు బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ సంస్మరణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పత్రీజీ తుదిశ్వాస విడిచి ఏడాది పూర్తి కావడంతో ది పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో ధ్యానులు మహేశ్వర మహాపిరమిడ్ చేరుకుంటున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని సోమ, మంగళ వారాల్లో పిరమిడ్ ఆవరణలో ప్రత్యేక ధ్యాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పచ్చదనమే గ్రీన్ ఇండియా చాలెంజ్ ధ్యేయం

రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ వెల్లడి



శాంతిసరోవర్ ప్రాంగణంలో కల్పతరువు-2 కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీ

రాయదుర్గం: మొక్కలు నాటే కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేసి పచ్చదనం పెంపొందించేందుకే 'గ్రీన్ ఇండియా చాలెంజ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ కార్యక్రమ సృష్టికర్త, రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కల్పతరువు-2' కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. అనంతరం శాంతిసరోవర్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భిన్న రంగాల్లో ఉన్నప్పటికీ అందరూ సమాజం బాగుండాలనే ఆశయంతో చేపట్టిన గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా తాము, కల్పతరువు ద్వారా బ్రహ్మకుమారీస్ సంస్థ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం భగవంతుడి సంకల్పంగా భావిస్తున్నామన్నారు. కల్పతరువు-1లో బ్రహ్మకుమారీస్ సంస్థ ద్వారా 16 లక్షల మొక్కలు నాటడం వారి సంకల్ప శక్తికి నిదర్శనమని, కల్పతరువు-2లో అంతకు మించి మొక్కలు నాటాలని ఆయన కోరారు. శాంతిసరోవర్ డైరెక్టర్ బి.కె కుల్‌దీప్ దీదీ మాట్లాడుతూ గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిర్మూలనకు పాటుపడటం సమాజహిత కార్యక్రమాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపక సభ్యులు కరుణాకర్‌రెడ్డి, రాఘవ, పలువురు బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓయూ న్యాయశాస్త్రం కోర్సుల పరీక్షల తేదీల వెల్లడి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో ఆగస్టు 3 నుంచి ప్రారంభం కానున్న వివిధ న్యాయశాస్త్రం కోర్సుల సెమిస్టర్ పరీక్షల తేదీలను వెల్లడించారు. ఎల్‌ఎల్‌బీ, బీఏ ఎల్‌ఎల్‌బీ, బీకాం ఎల్‌ఎల్‌బీ, బీబీఏ (3, 5 సంవత్సరాలు) కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పోస్టుల సెమిస్టర్ పరీక్షల వివరాలను ఉస్మానియా.ఏసీ.ఇన్ వెబ్‌సైట్లో చూడొచ్చు.

హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఆదివారం హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి నిహారిక కొణిదెల నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోని 350 మంది టాప్ డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు ఉన్నాయన్నారు. స్టైల్, డెకార్, లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ జ్యూలరీ, యాససరీస్ తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో యాక్టివిటిస్ట్ ఎస్.సబితారెడ్డి, నటీమణులు ఐశ్వర్య వెల్లింగుల, శాన్విమేఘన పాల్గొన్నారు.

రుణం.. జాప్యం



సరూర్‌నగర్ మండలానికి చెందిన రమేశ్ స్వయం ఉపాధి పథకంలో భాగంగా తనకున్న కొద్ది పాటి భూమిలో డెయిరీ పెట్టాలని భావించాడు. ఈ మేరకు బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాల కోసం 2016లో దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం రుణం ఇస్తే.. పది గేదెలు కొనాలనుకున్నాడు. ఇప్పటికీ ఆయనకు రుణం అందలేదు. డెయిరీ ఏర్పాటు చేయాలనే కల నెరవేర లేదు.

ఆమనగల్లుకు చెందిన జ్ఞానేశ్వర్ స్వయం ఉపాధి పథకంలో భాగంగా ఓ టెంట్ హౌస్‌ను ఏర్పాటు చేయాలని భావించాడు. బ్యాంకు రుణం ఇచ్చేందుకు అంగీకరించింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడంతో ఇప్పటికీ ఆయనకు సబ్సిడీ రుణం అందకుండా పోయింది. జిల్లా వ్యాప్తంగా బీసీ సబ్సిడీ రుణాల కోసం వేలాది మందికి ఎదురు చూపులు తప్పడం లేదు.

బీసీ కార్పొరేషన్ లోన్ కోసం దరఖాస్తులు

- ఏళ్లు గడిచినా అందని వైనం
- తాజాగా రూ.లక్ష ఆర్థిక సాయం కోసం అప్లికేషన్
- ఆశావహులకు తప్పని ఎదురుచూపులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సబ్సిడీ రుణాల కోసం 2015 నుంచి 2019 మధ్య కాలంలో బీసీ కార్పొరేషన్ దరఖాస్తులను ఆహ్వానించింది. ప్రభుత్వ ఉద్యోగాలు రాని నిరుద్యోగులు (టెన్త్, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారు) స్వయం ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా నుంచి 28,775 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 27,809 మందిని అర్హులుగా గుర్తించి, ఈ మేరకు వందశాతం రాయితీపై రూ.50 వేల చొప్పున 1,238 మందికి రూ.6,619 కోట్ల రుణాలు అందజేసింది. మరో 26,751 మందికి ఇప్పటికీ నిరీక్షణ తప్పడం లేదు. వారంతా జిల్లా బీసీ సంక్షేమశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వచ్చిన వారికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక సంబంధిత అధికారులు తల పట్టుకుంటున్నారు. ఒకవైపు ఇప్పటికే బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు వేలాది మంది ఉండగా.. మరోవైపు ప్రభుత్వం తాజాగా మరో పథకానికి శ్రీకారం చుట్టింది. వెనుకబడిన బీసీ కులాల నుంచి రూ.లక్ష సహాయం కోసం దరఖాస్తులను ఆహ్వానించడం గమనార్హం.

14 కులాలు.. 29,471 దరఖాస్తులు

బీసీబంధు పథకంలో భాగంగా ప్రభుత్వం నాయీబ్రాహ్మణ, రజక, సగర/ఉప్పర, కుమ్మరి, అవుసలి, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్రంగి, పూసలి, మేదరి, వడ్డెర, ఆరెకటిక, మేర, ఎంబీసీ కులస్తుల నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లా వ్యాప్తంగా 29,471 దరఖాస్తులు రాగా, వీరిలో 17,039 మందిని అర్హులుగా గుర్తించారు. 3,436 మందిని అనర్హులుగా ప్రకటించి, మరో 8,996 మంది దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. ప్రభుత్వం తొలి విడతగా నియోజకవర్గానికి 50 మంది చొప్పున అర్హులను గుర్తించి జూన్ 15 నుంచి చెక్కులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో రుణాల పంపిణీలో జాప్యం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచే పంపిణీ మొదలైనా.. జిల్లాలో ప్రారంభం కాకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జాబితా సిద్ధం అవుతోంది

బీసీ బంధులో భాగంగా ఇప్పటి వరకు 30 మందికి రుణాలు అందజేశాం. మిగతా వారి జాబితా సిద్ధం చేస్తున్నాం. త్వరలోనే అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందజేస్తాం. రుణాలు మంజూరు చేయిస్తామంటూ కొంతమంది మధ్యవర్తులు లబ్ధిదారులను మోసం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుంది.

– విమలాదేవి, జాయింట్ డైరెక్టర్, బీసీ కార్పొరేషన్

త్వరలో మొబైల్ కంట్రోల్ రూమ్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో తెరిపినివ్వకుండా వర్షాలు కురుస్తున్నాయి. ప్రతిరోజూ పదుల సంఖ్యలో చెట్లు నేలకూలుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఇళ్లు కూలిపోతున్నాయి. వర్షాకాలమైనా అగ్ని ప్రమాదాలూ ఆగడం లేదు. ఏ ప్రమాదమైనా తీవ్రస్థాయిలో జరిగితే.. అక్కడికక్కడ వెంటనే తగు నిర్ణయాలు తీసుకోవడంతో పాటు తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయమూ అవసరమవుతుంది. ప్రమాద స్థలిలోనే కంట్రోల్ రూమ్ ఉంటే రెస్క్యూ ఆపరేషన్ సులభమవుతుంది. ఇందుకోసం మొబైల్ కంట్రోల్ రూమ్‌కు జీహెచ్ఎంసీ ఈవీడీఎంలోని డీఆర్ఎఫ్ విభాగం సిద్ధమవుతోంది. కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు అవసరమైన వాహన కొనుగోలుకు జీహెచ్ఎంసీ టెండర్లు పిలిచింది. ఆన్-సీన్ కమాండ్, కోఆర్డినేషన్, కమ్యూనికేషన్ సెంటర్‌గా పనిచేయడానికి ఈ వాహనంలో అత్యంత ఆధునికమైన పరికరాలు, సమర్థమైన వర్క్ స్టేషన్ వంటివి ఉంటాయి. వివిధ ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులు/ ప్రతినిధులు సమావేశమై సమన్వయంతో తక్షణనిర్ణయాలు తీసుకోవడంతోపాటు అమలు చేయడానికి వీలవుతుంది. ప్రమాదం జరిగిన భవనం లేదా ప్రాంతంలోకి వెళ్లలేని పరిస్థితుల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌గా కూడా పని చేస్తుందని అధికారులు తెలిపారు.

వైశ్య కమిషన్ ఏర్పాటు చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న వైశ్య వికాస వేదిక నాయకులు

వైశ్య వికాస వేదిక డిమాండ్

హుడాకాంప్లెక్స్: వైశ్య కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు ఈడబ్ల్యూఎస్‌లో ఏబీసీడీ కేటగిరీలు అమలు చేయాలని వైశ్య వికాస వేదిక నాయకులు డిమాండ్ చేశారు. కర్మన్‌ఘాట్‌లో వేదిక వ్యవస్థాపక చైర్మన్ డా.లయన్ కాచం సత్యనారాయణగుప్తా ఆధ్వర్యంలో ఆదివారం 'వైశ్యులు–ఆత్మగౌరవం, హక్కుల సాధన' అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 300 మందికి పైగా జర్నలిస్టులు, టీచర్లు, న్యాయవాదులు హాజరై వైశ్యుల ఆత్మగౌరవం, హక్కులు, రాజకీయ వాటాలు తదితర అంశాలపై అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైశ్య కమిషన్, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వర్గీకరణ, జనాభా దామాషా ప్రకారం రాజకీయ వాటా, వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు, వైశ్య విద్యార్థుల కోసం ప్రత్యేక విదేశీ విద్యానిధి పథకం ఏర్పాటు, వైశ్యబంధు పథకం, వైశ్యుల జనసంఖ్య ఆర్థిక సామాజిక స్థితిగతులపై సమగ్ర కటుంబ సర్వేలోని వివరాలు ప్రకటించాలని తీర్మానాలు చేశారు. అనంతరం కాచం సత్యనారాయణగుప్తా మాట్లాడుతూ.. ఆయా తీర్మానాలపై రెండు రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి జగదీశ్వర్, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగ్ అధ్యక్షురాలు ఉప్పల శారద, ప్రధాన కార్యదర్శి కాచం సుష్మ, కోశాధికారి కల్వ సుజాత, వైశ్య వికాస వేదిక ట్రస్ట్ సభ్యులు నేలంటి మధు, నంగునూరి రమేశ్, వనపర్తి కిషన్‌గుప్తా, కాచం సాయి, బల్లు చంద్రప్రకాశ్, పబ్బ శ్రీనివాస్, బుక్కా ఈశ్వరయ్య, కొడుమూరి దయాకర్, మేడం బాలకృష్ణ, కేవీ ప్రతాప్, ప్రేమ్ గాంధీ, మాశెట్టి అనంతరాములు, కాచం శేఖర్, వందనపు అర్థం శ్రీనివాస్, కూర రమేశ్, రాంబాబు, కాచం శ్రీనివాస్, కొత్త రవి పాల్గొన్నారు.

చేతివృత్తులకు అండగా ఉంటాం



మంఖాల్‌లో మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

మంత్రి సబితారెడ్డి

తుక్కుగూడ: చేతివృత్తులకు ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని మంఖాల్‌లో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక్కో కులానికి ఆత్మగౌరవ భవనాలను నిర్మించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. గౌడ కులస్తులకు రూ.5 లక్షల ప్రమాద బీమా, గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించి ఉపాధి కల్పించామన్నారు. దివ్యాంగులకు ఆగస్టు నుంచి రూ.3 వేల నుంచి రూ.4 వేల పింఛన్ అందజేయనున్నట్లు చెప్పారు. తుక్కుగూడ మున్సిపాలిటీకి ముఖ్యమంత్రి మంజూరు చేసిన రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మంఖాల్‌లో ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

మంఖాల్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ కౌన్సిలర్లు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

ప్రజా సంఘాల నేతల డిమాండ్

షాద్‌నగర్: మణిపూర్ మారణహోమానికి పూర్తి బాధ్యత వహిస్తూ ప్రధాని రాజీనామా చేయాలని వివిధ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ ఆదివారం పట్టణంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మణిపూర్‌లో కొన్ని నెలలుగా భారతావని సిగ్గుతో తలదించుకునే ఘటనలు చోటు చేసుకుంటున్నా కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రధాని ప్రారంభ దశలోనే స్పందించి ఉంటే ఇంతటి దారుణాలు జరిగేవి కావన్నారు. వెంటనే సుప్రీంకోర్టు, రాష్ట్రపతి జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, వివిధ ప్రజా సంఘాల నాయకులు నర్సింలుగౌడ్, శ్రీను నాయక్, ఈశ్వర్ నాయక్, వెంకటరమణ, రజాక్, కుర్మయ్య, శివ, శ్రీకాంత్, కృష్ణయ్య, సత్యం, శ్యామల, కృష్ణ, రవికుమార్, నర్సింలు, అర్జునప్ప, టీజీ శ్రీనివాస్, చంద్రమౌళి, రాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు



పాతకోటతండాలో మొలకల ఊరేగింపు

ఉత్సాహంగా తీజ్

తలకొండపల్లి: మండల పరిధిలోని పాతకోటతండాలో ఆదివారం గిరిజనులు తీజ్ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. వారం రోజుల పాటు నిల్వ ఉంచిన మొలకలను పెళ్లికాని యువతులు నెత్తిన పెట్టుకుని సంప్రదాయ వాయిద్యాల నడుమ గిరిజన నృత్యం చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగలు మన ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. ఈ ఉత్సవాల్లో జీరానాయక్, మహిళలు, గిరిజనులు పాల్గొన్నారు.

తప్పిన వరద ముంపు

ట్రంక్‌లైన్ పనులతో సత్ఫలితాలు
- ఇప్పటికే 70శాతం పనులు పూర్తి
- పనులు పూర్తయితే శాశ్వత పరిష్కారం

బడంగ్‌పేట్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కొన్ని కాలనీలకు ముంపు ఉంటుందనుకున్నా అన్నికాలనీలు ప్రమాదం నుంచి గట్టెక్కాయి. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని శివనారాయణపురం, సాయిరాం నగర్, సాయి ప్రభు హోమ్స్, వెంకటేశ్వర కాలనీ, అల్మాస్‌గూడ పరిధిలోని సాయిబాలాజీ టౌన్ షిప్–1, కాశీబుగ్గ టెంపుల్, వైష్ణవి కాలనీ, బీరప్ప కాలనీ తదితర కాలనీలు కోవిడ్ తర్వాత వచ్చిన భారీ వరదలకు ముంపునకు గురయ్యాయి. వరద నీరు ఇళ్లలో చేరి నెలల తరబడి ఇబ్బందులు పడుతూ జీవనం సాగించారు. వారికోసం స్థానిక ప్రజాప్రతినిధులు తాగునీరు, పాలప్యాకెట్లు, నిత్యావసర సరుకులు, కూరగాయలు, అత్యవసర మందులు అందజేస్తూ రక్షణ కల్పించారు. వరదలు తగ్గిన వెంటనే శాశ్వత పరిష్కారం కోసం ఎస్ఎన్‌డీపీ (స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్లాన్) తీసుకువచ్చి పనులు ప్రారంభించారు. ఈ ట్రంక్‌లైన్ పనులు 70 శాతం వరకు పూర్తి చేశారు. నాలుగు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నప్పటికీ వరద నీరు ట్రంక్‌లైన్ నుంచి బయటకు వెళ్లడం లేదా ట్రంక్‌లైన్లల్లో నిలిచిపోయింది. ఈ ట్రంక్‌లైన్లతో కాలనీల్లోకి, ఇళ్లలోకి, కాలనీల్లోని రోడ్ల మీదకు వరద రాకుండా ఉపయోగపడ్డాయి. పనులు పూర్తయితే వరద ముంపు ప్రాంతాలను శాశ్వతంగా బయట పడినట్టేనని స్థానికులు చర్చించుకుంటున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే మిగిలిన ఎస్ఎన్‌డీపీ ట్రంక్‌లైన్ పనులు పూర్తి చేసి కాలనీలకు, ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపుతామని బడంగ్‌పేట కార్పొరేషన్ అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం ట్రంక్‌లైన్‌లో చేరిన నీటిని తొలగించే కార్యక్రమం చేపడుతున్నారు.



శివసాయినగర్ కాలనీలో ట్రంక్‌లైన్‌లో చేరిన నీరు

మంత్రి చొరవతోనే..



రెండేళ్ల క్రితం అర్ధరాత్రి మనుషులు కొట్టుకుపోతుంటే కాపాడాం. వరదల్లో చిక్కుకున్న బాధితులకు అన్నీ తామై అండగా నిలిచాం. ఆ కష్టాలు చూసిన మంత్రి సబితారెడ్డి శాశ్వత పరిష్కారం దిశగా ఆలోచన చేసి రూ.62 కోట్లతో ట్రంక్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టేలా చొరవ తీసుకున్నారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తలేదు. శాశ్వత పరిష్కారానికి చొరవ తీసుకున్న మంత్రి సబితారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు.

– లిక్కి మమత, కార్పొరేటర్

ప్రజా భాగస్వామ్యమే ప్రధానం

షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

నందిగామ: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రజల భాగస్వామ్యమే ప్రధానమని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన కొత్తూరు మండల పరిధిలోని గూడూరు, మక్తగూడ, మల్లాపూర్, మల్లాపూర్ తండా, నందిగామ మండల పరిధిలోని తాళ్లగూడ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సమస్యలను స్థానికులు, నాయకులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నెలకొన్న ప్రతీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పల్లెలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట జెడ్పీవైస్ చైర్మన్ ఈట గణేశ్, ఇన్‌చార్జి ఎంపీపీ శోభా నాయక్, చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్, వైస్ చైర్మన్ మున్నూరు పద్మారావు, సర్పంచ్‌లు రాజు,అనిత, సాయిలు, సత్తయ్య, రవి నాయక్, ఎంపీటీసీ సభ్యుడు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, యాదగిరి, మధుసూదన్ రావవు, శ్రీశైలం, లక్ష్మణ్ నాయక్, దశరథ్, మల్లేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

జిల్లా సాధనకు ఐక్య ఉద్యమం

సాధన కమిటీ అధ్యక్షుడు సంతోష్

షాద్‌నగర్: షాద్‌నగర్ జిల్లా కేంద్రం ఏర్పాటు కోసం పార్టీలకు అతీతంగా అందరు ఐక్యంగా ఉద్యమిద్దామని జిల్లా సాధన కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని దేవీ గ్రాండ్ హోటల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామికంగా, వ్యాపార పరంగా షాద్‌నగర్ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతున్నందున జిల్లా కేంద్రం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం జిల్లా సాధన కమిటీ మండలాల ఇన్‌చార్జిలను ఎన్నుకున్నారు. ఫరూఖ్‌నగర్ మండల ఇన్‌చార్జిగా సింగారం శ్రీశైలం, కొందుర్గు మండల ఇన్‌చార్జిగా చేగూరు మహిపాల్‌రెడ్డి, కేశంపేట మండల ఇన్‌చార్జిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సమావేశంలో కమిటీ పట్టణ అధ్యక్షుడు కాసోజు శివకుమార్, దర్గా వెంకటేశ్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, ఫిరంగి రామకృష్ణ, గుండ్ల నవీన్, ఇంద్రకంటి హరికృష్ణ, వికాస్, పట్నం నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలను అందజేస్తున్న సంతోష్

భవిష్యనిధి వివరాలు కనుమరుగు

- ఆన్‌లైన్‌లో కనిపించక ఆందోళన చెందుతున్న ఉపాధ్యాయులు
- జీపీఎఫ్ పాక్షిక ఉపసంహరణకు డిమాండ్
- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పాండురంగారెడ్డి

వనస్థలిపురం: భవిష్య నిధి (జీపీఎఫ్) ఖాతాల్లో దాచుకున్న నగదుపై ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్తు పాండురంగారెడ్డి, పుట్టపాక ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 2004కు ముందుగా నియామకమైన ఉపాధ్యాయుల జీతాల నుంచి కొంత మొత్తం భవిష్యత్ అవసరాల కోసం జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే జీపీఎఫ్‌లో జమ చేసుకునేవారు. జమ వివరాలు గతంలో ఆన్‌లైన్‌లో చూసుకునేవారని.. ఇటీవల ఆన్‌లైన్ కనిపించడం లేదని అసలు నగదు జమ అవుతుందో తెలియడం లేదని వాపోతున్నారు. నూతన జిల్లాల వారీగా ఉపాధ్యాయుల విభజన జరిగినప్పటికీ జీపీఎఫ్ ఖాతాల విభజన చేపట్టకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఆరోగ్య, వివాహ, గృహ నిర్మాణ అవసరాలకు తమ ఖాతాల్లో దాచుకున్న నగదు కోసం ఉపాధ్యాయులు ఏడాది నుంచి ఎదురు చూస్తున్నారని చెప్పారు. జీపీఎఫ్ ఖాతాల విభజన సాకుగా చూపుతూ మూడు నెలలుగా పాక్షిక ఉపసంహరణ దరఖాస్తులు స్వీకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమ డబ్బులు ఇతర అవసరాలకు దారి మళ్లించినందునే తమ అవసరాలకు నగదు అందడం లేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. జీపీఎఫ్ ఖాతాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పాక్షిక నగదు విరమణకు అవకాశం ఇవ్వాలన్నారు. లేదంటే ఉపాధ్యాయులతో కలిసి జిల్లా పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

నేడు కేజీబీవీ పాఠశాల భవనం ప్రారంభోత్సవం

కొందుర్గు: మండల పరిధిలోని పులుసుమామిడి గ్రామంలో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రారంభిస్తారని ఎంపీపీ పోతురాజు జంగయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అనంతరం మహదేవ్‌పూర్ శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం భూమిపూజ చేయనున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమానికి అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని వారు కోరారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023–24 సంవత్సరానికి పండ్ల తోటల పెంపకానికి ఈ నెల 31 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఇబ్రహీంపట్నం మండల ఏపీఓ తిరుపతాచారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మామిడి, జామ, నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, మునగ, కొబ్బరి(గట్ల వెంట మాత్రమే), డ్రాగన్ ఫ్రూట్(కేవలం అర ఎకరా మాత్రమే), సపోటా, ఆయిల్‌పామ్, బత్తాయి, అల్లనేరేడు పండ్ల తోటలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, ఐదు ఎకరాలలోపు పట్టాదారులు, ఉపాధి జాబ్ కార్డు, బోరు బావి, విద్యుత్ సౌకర్యం కలిగిన వారు అర్హులన్నారు. దరఖాస్తు ఫారంతోపాటుగా పట్టదారు పాసుబుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు, పాన్ కార్డ్, ఉపాధి జాబ్ కార్డు జిరాక్స్ ప్రతులు, మూడు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు, గ్రామ పంచాయతీ తీర్మాన కాపీని జత చేయాలని సూచించారు. ఈ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యదర్శికి, ఏఈఓ, ఏపీఓలకు అందజేయాలన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతాచారి కోరారు.

పబ్లిక్ స్పీకింగ్‌పై స్పెషల్ క్యాంప్

ఇబ్రహీంపట్నం: పబ్లిక్ స్పీకింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై స్పెషల్ ట్రైనింగ్ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సదావెంకట్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31న వినోభానగర్‌లోని సాధన కుటీర్‌లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత, స్వచ్ఛంధ సంస్థల నిర్వాహకులకు, రాజకీయ నాయకులకు, వివిధ వృత్తుల్లో ఉన్నవారికి ఉపయోగపడేలా ఈ ట్రైనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 27లోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. కేవలం 50 మందికే ఆవకాశం ఉంటుందని చెప్పారు. ఈ శిబిరం ప్రారంభోత్సవానికి రామకృష్ణ మఠం(హైదరాబాద్) స్వామి శితికంఠానంద మహరాజ్, రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ దిలీప్‌రెడ్డి, రాణి రుద్రమదేవి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, సామాజిక కార్యకర్త రాజేందర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్‌కు గాయాలు

చేవెళ్ల: నెట్ కేబుల్ వైర్లను సరి చేస్తున్న ఆపరేటర్ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. నేపాల్‌కు చెందిన అనిల్(21) స్థానికంగా నెట్ కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం కేబుల్ వైర్లను సరిచేసేందుకు పోలీస్ స్టేషన్ ఎదుట ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఎక్కాడు. అది హైటెన్షన్ స్తంభం అవ్వడంతో పాటు వర్షాలకు తడిసి ఉంది. దీంతో పైకి ఎక్కిన అనిల్ విద్యుదాఘాతంతో కిందపడుతుండగా కాలు స్తంభంలోనే ఇరుక్కుని వేలాడుతూ కన్పించాడు. గమనించిన స్థానికులు కేకలు వేడయంతో స్పందించిన పోలీసులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు. ఎస్ఐ ప్రదీప్‌కుమార్ జేసీబీని పిలిపించగా.. కానిస్టేబుల్ రవికుమార్ పైకి వెళ్లి క్షతగాత్రుడిని కిందకు దింపారు. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆపరేటర్ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



స్తంభంపై వేలాడుతున్న ఆపరేటర్‌ను జేసీబీ సాయంతో కిందికి దించుతున్న కానిస్టేబుల్ రవి

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన కారు



నుజ్జునుజ్జయిన కారు

కందుకూరు: వేగంగా వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సోమవారం అర్ధరాత్రి ఆమనగల్లు వైపు నుంచి వేగంగా వచ్చిన కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. కాగా ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను శ్రీశైలం హైవేపై ఏర్పాటు చేసిన వీధి దీపాల నిర్వహణ కోసం ఇటీవలే ఏర్పాటు చేశారు. కనెక్షన్ ఇచ్చి ఏబీ స్విచ్ ఆఫ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ కారు ఎవరిది? అందులో ఎంత మంది ప్రయాణిస్తున్నారనే సమాచారం ఇంకా తెలియరాలేదు. మద్యం మత్తులో ఈ ఘటన జరిగి ఉండవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

అన్ని నియోజకవర్గాల్లో పోటీ

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్

మీర్‌పేట: వచ్చే ఎన్నికల్లో టీడీపీ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. జిల్లా పరిధిలోని మీర్‌పేటలో నూతనంగా నిర్మించిన మహేశ్వరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ.. పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు ఆగస్టు 15 తరువాత బస్సుయాత్రతో పాటు ఇతర కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్తామన్నారు. టీడీపీతోనే బీసీలకు రాజకీయంగా న్యాయం జరిగిందని గుర్తుచేశారు. యువత స్వచ్ఛందంగా పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. వచ్చేఎన్నికల్లో ప్రజలు టీడీపీకి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట కార్పొరేటర్ మల్లేశ్ ముదిరాజ్, టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేశ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భిక్షపతి ముదిరాజ్, ప్రకాశ్ ముదిరాజ్, రవీంద్రాచారి, వాసు సాగర్, ఆసిఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ మహేశ్వరం నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కాసాని జ్ఞానేశ్వర్

‘గురుకుల’ సమస్యలు పరిష్కరించండి



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్

మొయినాబాద్: మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం పీడీఎస్‌యూ నాయకులు శంకర్‌పల్లి గురుకుల పాఠశాలను సందర్శించారు. మూడు రోజుల క్రితం జరిగిన షాట్ సర్క్యూట్ ఘటనపై ప్రిన్సిపాల్, విద్యార్థులతో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని.. ప్రస్తుతం హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు జైపాల్, కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు అశోక్, శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆకట్టుకుంటున్న ననాజీపూర్ కత్వ

శంషాబాద్ రూరల్: మండలంలోని చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు చేరి నిండు కుండను తలపిస్తున్నాయి. ననాజీపూర్ వద్ద ఎంటీరువాగుపై ఉన్న కత్వ నుంచి పారుతున్న వరదనీరు జలపాతంలా అందరిని ఆకట్టుకుంటోంది. మూడు రోజులుగా పారుతున్న ఈ వరదను చూసేందుకు భారీగా ప్రజలు తరలివస్తున్నారు. ఇక్కడి కత్వనీళ్లలో ఈత కొట్టడం ప్రమాదకరంగా ఉన్నా యువకులు స్నానం చేసేందుకు వెనకాడటంలేదు.

హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసినా..

పంచాయతీ, పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి దారికి అడ్డంగా ముళ్ల కంప వేసినా జనం కత్వంపైకి ఇతర మార్గాల్లో చేరుకుంటున్నారు. సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.



కత్వ నుంచి జలపాతాన్ని తలపిస్తున్న నీటి ప్రవాహం